క్లుప్తంగా

జగనన్న కాలనీలో నిర్మాణ పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: కొమ్మరపూడిలోని జగనన్న కాలనీలో రూ.11.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు భూమి పూజను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అర్హులకు ఇళ్ల స్థలాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం కొమ్మరపూడిలో రక్షిత మంచినీటి ప్లాంట్‌ను ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగా రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, పార్టీ నేతలు స్వర్ణా వెంకయ్య, మల్లు సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు మొబీనా, వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థాన చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

• పది మందికి గాయాలు

నెల్లూరు రూరల్: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో పది మంది గాయపడిన ఘటన నెల్లూరు – ముత్తుకూరు రోడ్డులోని ఆకుతోట వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నెల్లూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నుంచి ముత్తుకూరు వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తొలుత జీజీహెచ్‌కు అనంతరం నగరంలోని వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో ముత్తుకూరు మండలానికి చెందిన వారు ముగ్గురు కాగా, మిగిలిన వారు వైఎస్సార్ జిల్లా బద్వేలు ప్రాంతానికి చెందిన వారిగా తెలిసింది. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గీతామయి, నేతాజీ వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. అనంతరం వృద్ధులకు మిఠాయిలను పంపిణీ చేశారు. యూత్ ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్, కార్తికేయ, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 585 విద్యుత్ కేసులకు పరిష్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ చౌర్యానికి సంబంధించిన 585 కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం రాజీ చేశారని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కేసులను రాజీ చేసి రూ.7,94,500 జరిమానా విధించారని చెప్పారు. రాజీ ప్రక్రియకు కృషి చేసిన విద్యుత్ విజిలెన్స్, యాంటీ థెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారన్నారు.

పోలీసులు అప్రమత్తం

నెల్లూరు(క్రైమ్): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును నంద్యాలలో సీఐడీ అధికారులు శనివారం అరెస్ట్ చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉండటంతో జిల్లాలోని పలువురు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులను హౌస్ అరెస్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లతో పాటు ఆర్టీసీ బస్టాండ్ల వద్ద పోలీస్ గస్తీని ఏర్పాటు చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చింతారెడ్డిపాళెంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ, అల్లీపురంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తదితరులను హౌస్ అరెస్ట్ చేశారు.

జిల్లాలో 144 సెక్షన్

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, సభలు, ర్యాలీలు నిర్వహించరాదని, నలుగురికి మించి బహిరంగ ప్రదేశాల్లో గుమికూడరాదని చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనిభారం మోపడం తగదు

నెల్లూరు రూరల్: ఉపాధ్యాయులపై పనిభారం మోపడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

నెల్లూరు రూరల్: వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐ కళాశాలలో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను సోమవారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో కోచింగ్‌ను పూర్తి చేసుకున్న వారు హాజరుకావాలని కోరారు.

చంద్రబాబు అవినీతి బట్టబయలు

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో నిధులను పక్కదారి పట్టించి అడ్డంగా దొరికిపోయిన టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. దీంతో ఆయన అసలు రూపం బట్టబయలైందని పలువురు పేర్కొన్నారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకొని ఇన్నాళ్లు తప్పించుకొని తిరిగిన ఆయన్ను అరెస్ట్ చేయడం శుభపరిణామమని తెలిపారు.

– నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు(వీఆర్సీ సెంటర్) / నెల్లూరు(దర్గామిట్ట)

న్యాయం గెలిచింది



అన్ని వ్యవస్థలను చంద్రబాబు గుప్పిట్లో ఉంచుకున్నారు. ఆయన అరెస్ట్‌తో న్యాయం గెలిచింది. ఎన్నో అక్రమాలు చేసిన బాబు అరెస్ట్ కావడంతో న్యాయవ్యవస్థపై గౌరవం మరింత పెరిగింది. నాయకులు తమ తెలివితేటలను మోసాలకు ఉపయోగించకూడదనే అంశం రుజువైంది.

– ఖలీల్ అహ్మద్, డిప్యూటీ మేయర్

తప్పు చేస్తే అరెస్ట్ చేయకూడదా..?



చంద్రబాబు తప్పు చేస్తే అరెస్ట్ చేయకూడదా..? రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆధారాలతో సహా నిర్ధారించి మాజీ సీఎం చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ విషయంలో సీఐడీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్, ఐటీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. చంద్రబాబు అవినీతి, అక్రమాలు మరిన్ని బయటకొస్తాయి.

– రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్

తప్పులకు శిక్ష అనుభవించాల్సిందే



సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు ఎన్నో తప్పులు చేశారు. వీటికి శిక్ష అనుభవించాల్సిందే. చంద్రబాబును అరెస్ట్ చేయడంలో ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఓటుకు నోటు కేసులో భయపడి హైదరాబాద్ నుంచి ఆయన పారిపోయి వచ్చారు. అలాంటి వ్యక్తికి తగిన శాస్తి జరిగింది.

– దేవరకొండ సుజాత, 53వ డివిజన్ కార్పొరేటర్

ప్రజాధనాన్ని దోచుకోవడంలో బాబు దిట్ట



ప్రజాధనాన్ని దోచుకోవడంలో బాబుకు ఉన్న తెలివితేటలు ఇంకెవరికీ లేవు. రాజధాని విషయంలో గ్రాఫిక్స్‌తో ప్రజలను పక్కదోవ పట్టించారు. రైతులు, ప్రజలను మోసం చేసిన చరిత్ర ఆయనది. న్యాయవిచారణ సమగ్రంగా జరగాలి.

– కిన్నెర ప్రేమ్‌కుమార్, పదో డివిజన్ కార్పొరేటర్

అన్నిసార్లు మోసం చేయడం కుదరదు



చంద్రబాబు మోసాలు ఇంక కుదరవు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకున్నారు. నిజాన్ని.. అబద్ధాన్ని ప్రజలు ఇట్టే తేల్చేస్తారు. చంద్రబాబు సంగతిని చట్టమే బయటపెడుతుంది.

– వేలూరు మహేష్‌బాబు, 46వ డివిజన్ కార్పొరేటర్

అన్యాయం ఎక్కువ రోజులు నిలవదు



ఆస్తులు పెంచుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగింది. ఈ అన్యాయం ఎక్కువ రోజులు నిలవదు. ప్రజలు ఓట్లు వేస్తే కొన్ని వర్గాలకే సాయం మిగిలిన వారిని విస్మరించారు. చంద్రబాబు అరెస్ట్‌ను ప్రజలు స్వాగతిస్తున్నారు.

– సంక్రాంతి అశ్విని, మూడో డివిజన్ కార్పొరేటర్

సత్యమే గెలుస్తుంది



అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఎన్నో మోసాలు, అక్రమాలకు పాల్పడ్డారు. చివరికి న్యాయమే గెలిచింది. మోసాలు చేసి ఎక్కువ రోజులు తప్పించుకొని తిరగలేరనే విషయం చంద్రబాబు అరెస్ట్‌తో అర్థమైంది.

– ఓబిలి రవిచంద్ర, ఐదో డివిజన్ కార్పొరేటర్

చట్టం తన పని తాను చేసుకుపోతుంది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఎన్నో పన్నాగాలు పన్నిన చంద్రబాబు అరెస్ట్ కావడం న్యాయవ్యవస్థ పనితీరుకు నిదర్శనం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిన బాబు విషయాన్ని చట్టమే తేలుస్తుంది.

– కర్తం ప్రతాప్‌రెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదు



పసుపు, కుంకుమ పేరిట గత ఎన్నికల్లో గెలవాలనుకున్న చంద్రబాబు నైజం ప్రజలకు అర్థమైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ప్రభుత్వ ధనాన్ని అక్రమార్కుల ఖాతాల్లో వేసిన విషయంలో సాక్ష్యాలతో చంద్రబాబును అరెస్ట్ చేశారు. కుంభకోణాలపై విచారణ నిష్పక్షపాతంగా జరిగింది.

– కామాక్షిదేవి, 8వ డివిజన్ కార్పొరేటర్

అరెస్ట్ రాజకీయ కుట్ర కాదు



టీడీపీ అధినేత చంద్రబాబు తన తప్పులను వ్యవస్థల ద్వారా మేనేజ్ చేసుకుంటూ ఇన్నేళ్లుగా తప్పించుకుంటూ వచ్చారు. ఆయన అరెస్ట్ రాజకీయ కుట్ర కాదు. చంద్రబాబు తప్పులను విచారించి.. బాధ్యుడని నిర్ధారించుకున్నాకే అరెస్ట్ చేశారు. తెలంగాణలో ఓటుకు నోటు కేసులో ఇరుక్కొని అక్కడి నుంచి పారిపోయి వచ్చారు. ఏ నిర్ధారణ లేకుండానే జగన్‌మోహన్‌రెడ్డిని జైల్లో ఉంచిన పాపం ఊరికేపోదు.

– ఆనం జయకుమార్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నేత

పేదలకు మందుల అందజేత



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకం ద్వారా పేదలకు మందులను ఉచితంగా శనివారం పంపిణీ చేశారు. బాలాజీనగర్‌లోని వికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఇంటూరు శ్రీనివాసులు తన సతీమణి ఇంటూరి పద్మశ్రీ జ్ఞాపకార్థం రూ.50 వేల విలువజేసే మందులను అందజేశారని వివరించారు. ఇంటూరి శ్రీహర్ష, చంద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో నెలవారీ సమావేశం



ఆర్డీఓను సత్కరిస్తున్న సభ్యులు

నెల్లూరు(మినీబైపాస్): సోమశేఖరపురంలోని గుర్రం జాషువా ప్రజాగ్రంథాలయంలో నెలవారీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ మలోల మాట్లాడారు. తాను జాషువా వీరాభిమానినని చెప్పారు. అనంతరం ఆర్డీఓను సత్కరించారు. గ్రంథాలయ వర్కింగ్ ప్రెసిడెంట్, విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి ఖాసిం, కృపాల్, శరత్‌బాబు, ప్రతాప్, రవీంద్రబాబు, కిన్నెర వెంకటేశ్వర్లు, జనార్దన్, కారత్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో అన్నదానం



నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బాలాజీనగర్‌లోని పిండిమిల్లు సెంటర్‌లో అన్నదానాన్ని బాలాజీనగర్ యూత్ అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని వెంకటేశ్వర్లునాయుడు, సురేష్, మామిడాల రవి ప్రారంభించారు. తొలుత కృష్ణుడ్ని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. రమేష్‌రాజు, జీవన్‌కుమార్, శేఖర్, దుర్గ, శివ, చక్రి, అనిల్, చందు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ అభివృద్ధే ధ్యేయమని, ఈ విషయంలో వెనుకడుగేసే ప్రసక్తే లేదని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 20వ డివిజన్లోని ఆర్టీఏ కార్యాలయ రోడ్డులో గల షార్ కాలనీలో రూ.45 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి రూ.ఆరు కోట్లు మంజూరయ్యాయని, అభివృద్ధి పనులకు శంకుస్థాపనను త్వరలో చేపట్టనున్నామని వివరించారు. సరైన ప్లాన్‌తో లేఅవుట్లను వేయాలని నిర్వాహకులకు సూచించారు. డ్రెయిన్లు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఇరుకళల పరమేశ్వరి ఆలయ చైర్మన్ రావు శ్రీనివాస్ రావు, తాళ్లూరు సురేష్‌ను అభినందించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జీలు శ్రీనివాసరావు, సురేష్‌బాబు, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నేతలు ఏసునాయుడు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలో చేరికలు శుభపరిణామం



నెల్లూరు రూరల్ : దీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగుతున్న కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామమని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీలో కొనసాగుతున్న 25వ డివిజన్ బుజబుజనెల్లూరుకు చెందిన 150 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరాయి. నగరంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నేత పేర్నాటి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బీబీజాన్ నాయకత్వంలో ఎంపీ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేతలు స్వర్ణ వెంకయ్య, హరిబాబు, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మొబీనా, వేలూరు శ్రీధర్‌రెడ్డి, వేలూరు శివ, సునీల్ కుమార్‌రెడ్డి, పాశం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణం



నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి వేడుకలు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాత్మా గాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణుడికి కల్యాణోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, సుబ్బరామరాజు తదితరులు పర్యవేక్షించారు.

• క్రాంతినగర్‌లోని శివకేశవులు దేవస్థానంలో కొలువైన శివకేశవులు, కృష్ణుడికి పూజలను నిర్వహించారు. శ్రీహరిపురం పురుషోత్తమ రామానుజదాస భక్త భజన సభ ఆధ్వర్యంలో కళాకారుల హరినామ సంకీర్తనలు, నృత్య ప్రదర్శనలను జరిపారు. దేవస్థాన చైర్మన్ దరిశిగుంట పెంచలయ్య, మల్లికార్జున, గోవిందు, నరసయ్య, మల్లికార్జున, సురేంద్ర, సాయి, రాకేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: ప్రముఖ పారిశ్రామికవేత్త పీవీ ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని మాగుంట లేఅవుట్లో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పలు విషయాలపై వారు చర్చించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడలు ఆడటంతో పాటు వ్యాయామాన్ని ఉద్యోగులు తప్పక చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రికెట్ పోటీలను ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజినీర్ల సంఘం, డిప్లొమా ఇంజినీర్ల సంఘ కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు బాబూరావు, మున్వర్ మాట్లాడారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, పరుగు పందేలను నిర్వహిస్తున్నామని, ఇంజినీర్స్ డే సందర్భంగా విజేతలకు బహుమతులను ఈ నెల 15న అందజేయనున్నామని వివరించారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాలసుబ్బారావు, గిరినాథ్, వేణుగోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞతార్పణల పండగ



నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ వార్షిక కృతజ్ఞతార్పణల పండగను శనివారం నిర్వహించారు. చర్చి కార్యదర్శి గుర్రం అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేసి సంతోష, సహవాస కార్యక్రమాన్ని జరిపారు. క్రీడా పోటీలు, బైబిల్ క్విజ్‌ను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్ కుమార్ వాక్యోపదేశం చేశారు.

ఉపాధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట): జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. వివిధ మండలాల అధికారులతో శనివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిపేలా చూడాలని సూచించారు. ప్లాంటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, హౌసింగ్‌కు సంబంధించి 90 రోజుల పనిదినాలను కల్పించాలని ఆదేశించారు. ఉపాధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

13 నుంచి స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ఈ నెల 13 నుంచి 30 వరకు వివిధ స్థాయిల్లో స్కూల్ గేమ్స్‌ను నిర్వహించి క్రీడా జట్లను ఎంపిక చేయనున్నామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 14వ తేదీల్లో మండల స్థాయి, 21 నుంచి 23 వరకు నియోజకవర్గ స్థాయి, 25 నుంచి 27 వరకు, 29, 30వ తేదీల్లో జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు ఉంటాయని వివరించారు. వివరాలకు 99485 51484 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఫుట్‌బాల్ జిల్లా జూనియర్స్ బాలబాలికల జట్లను సోమవారం ఎంపిక చేయనున్నామని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎంపికలను నిర్వహించనున్నామని, 2008, జనవరి ఒకటి నుంచి 2009, డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు అర్హత పత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు ఇంజినీర్లు శనివారం తెలిపారు.